సాక్షి తిరుపతి

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



తుమ్మలగుంట బ్రహ్మోత్సవం

తుమ్మలగుంట బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ఊపందుకున్నాయి. విద్యుద్దీపాలంకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. - IIలో



లారీ కింద హాహాకారాలు

ఓ వ్యక్తి రోడ్డు దాటే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. లారీ ఢీకొనడంతో ఓ కాలు నుజ్జునుజ్జయ్యింది. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	35	25
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	36	26

న్యూస్‌రీల్

అభివృద్ధే మా అభిమతం



టవర్ పోల్ లైట్స్‌ను ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: నమ్మిన ప్రజానీకానికి అండగా.. విశ్వసనీయతకు కేరాఫ్ అడ్రస్‌గా.. అభివృద్ధే అభిమతంగా.. చంద్రగిరి నియోజకవర్గంలో పాలన కొనసాగిస్తున్నామని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రూ.40 లక్షలతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు భూమి పూజ చేశారు. అలాగే రూ.11.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. చంద్రగిరి టవర్ క్లాక్ సర్కిల్ వద్ద రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన టవర్ పోల్ లైట్స్‌ను, చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టవర్ పోల్స్ లైట్స్‌ను ఆయన ప్రారంభించారు. 2024 ఎన్నికల్లో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రూప రామ్మూర్తి, కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, ఎంపీటీసీలు ఆజీజ్ నుస్రత్, మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. గురువారం అర్ధరాత్రి వరకు 75,059 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు లక్ష కుంకుమార్చన

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకామాక్షి అమ్మవారికి లక్ష కుంకుమార్చన సేవ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం లక్ష కుంకుమార్చన నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయంలోని మండపంలో శ్రీకామాక్షి అమ్మవారిని కొలువు తీర్చి లక్ష కుంకుమార్చన చేస్తారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీచంద్రశేఖర స్వామి, శ్రీమనోన్మణి అమ్మవారి వీధి ఉత్సవం జరుగనుంది.

ఓవరిన్ డిసీజ్‌పై అవగాహన

తిరుపతి సిటీ: తిరుపతి కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు పాలిసిస్టిక్ ఓవరిన్ డిసీజ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంతోనే కుటుంబ ఆర్థిక పరిస్థితి ఆధారపడి ఉంటుందన్నారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాలిసిస్టిక్ ఓవరిన్ డిసీజ్‌పై జాగ్రత్తలు, ఆచరించాల్సిన నియమాలను వివరించారు.



ఆధ్యాత్మిక నగరానికి.. అభివృద్ధి శోభ

నాడు: శ్రీవారి దర్శనం కోసం ప్రతి రోజూ లక్షలాది మంది భక్తులు తిరుపతికి చేరుకున్నా అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పేరుకు ఆధ్యాత్మిక నగరం అయినా అభివృద్ధికి నోచుకోని పరిస్థితి. ఇరుకు సందులు.. గుంతలమయమైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం. స్థానికులు, పర్యాటకులు, భక్తులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు పచ్చదనం కరువై వెలవెలబోయేవి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పేరుకు అంతర్జాతీయ విమానాశ్రయం అయినా.. అభివృద్ధికి నోచుకోలేదు. తిరుపతిలో కాలుమోపిన వారికి ట్రాఫిక్, మంచినీటి సమస్యలు అడుగడుగునా పలకరించేవి. తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది.

నేడు: నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో ఆధ్యాత్మిక నగరం అభివృద్ధి శోభను సంతరించుకుంటోంది. ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు తిరుమల తిరుపతి దేవస్థానం స్థానికులు, భక్తులకు అన్ని సౌకర్యాలను సమకూరుస్తున్నాయి. నాటి సందులు నేడు రహదారులుగా మారాయి. మాస్టర్ ప్లాన్‌తో రోడ్ల అభివృద్ధి శరవేగంగా సాగుతోంది. నగర శివారు కాలనీలు అత్యాధునిక ప్రాంతాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. యూడీఎస్, మురుగు కాలువలు, తాగునీరు, పైప్‌లైన్లు నూతనంగా నిర్మిస్తున్నారు. రోడ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్‌తో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. గడచిన మూడేళ్లలో 125.19 కి.మీ మేర సీసీ రోడ్లు, 32.02 కి.మీ. బీటీ రోడ్లను అభివృద్ధి చేశారు. మూడో విడతలో రూ.132 కోట్లతో 150 కి.మీ సీసీ రోడ్లు నిర్మించారు. మరో రూ.30 కోట్లతో 65కి.మీ మేర బీటీ రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- సాక్షి, ఏపీ నెట్‌వర్క్

- భక్తులకు వసతులు, రక్షణే లక్ష్యం
- రూ.650 కోట్లతో శ్రీనివాస సేతు నిర్మాణం
- మరో రూ.135 కోట్లతో మాస్టర్ ప్లాన్, సీసీ రోడ్లు
- ఆహ్లాదం కోసం ఆధునిక పార్కులు.. మౌలిక వసతులు
- తిరునగరికి తలమానికంగా వినాయక సాగర్ పార్కు
- 18న శ్రీనివాస సేతును ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

రూ.650 కోట్లతో శ్రీనివాస సేతు నిర్మాణం

శ్రీవారి భక్తులు, పర్యాటకుల రాకపోకలకు వీలుగా రూ.650 కోట్లతో శ్రీనివాస సేతు నిర్మాణం పూర్తి చేశారు. తిరుచానూరు మార్గంలోని మామిడికాయల మండీ నుంచి అలిపిరి పోలీస్ స్టేషన్ వరకు, కరకంబాడి మార్గంలో మద్దిమానులు ఉన్న ప్రాంతం వరకు ఈ వంతెన నిర్మాణం పూర్తయింది.



ఆహ్లాదం.. ఆనందం

పార్కులను ఆధునికంగా తీర్చిదిద్దారు. ఆక్సిజన్ ఉత్పత్తి చేసే మొక్కలతో పాటు వాకర్స్‌కు ట్రాక్, స్కేటింగ్ గ్రౌండ్, ఓపెన్ ఆడిటోరియం, వాటర్ ఫౌంటైన్, చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలను కల్పించారు. ప్రకాశం పార్క్ ఆధునీకరణకు రూ.1.20 కోట్లు, బైరాగిపట్టెడ పద్మావతీ పార్క్‌కు రూ.42.50 లక్షలు, వినాయకసాగర్ మొదటి దశను రూ.20 కోట్లతో అభివృద్ధి చేశారు.



తిరుపతి ట్యాంక్ బండ్‌గా వినాయక సాగర్

మురికి కూపంగా ఉన్న వినాయకసాగర్‌ను రూ.42 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. సాగర్‌లోకి శుద్ధిచేసిన నీటిని విడుదల చేసేందుకు ఇటీవల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐలాండ్‌తో పాటు బోటింగ్ పాయింట్, కిడ్స్ పార్క్, సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఫుడ్ కోర్టు, వినాయక ప్రతిమల నిమజ్జనానికి ప్రత్యేక బ్లాక్, పార్కింగ్, ఓపెన్ ఆడిటోరియం వంటి సౌకర్యాలను అభివృద్ధి చేశారు.



సుందర రహదారులు

ఈ ఏడాది శెట్టిపల్లి పంచాయతీని విలీనం చేయడంతో తిరుపతి నగర విస్తీర్ణం 30.1 చ.కి.మీ చేరింది. విస్తీర్ణం పెరిగినా అభివృద్ధి పాత నగరానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నగర విస్తరణకు కంకణం కట్టుకున్నారు. ముందుగా వైఎస్సార్ మార్గ్ (డీబీఆర్ రోడ్డు), రేణిగుంట–కరకంబాడి రోడ్డును కలుపుతూ అన్నమయ్య మార్గ్ నిర్మించారు. మరో 15 మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టారు.

తిరుపతి వివరాలు

విస్తీర్ణం	30.01 చ.కి.మీ
గృహాలు	92 వేలు
జనాభా	4.01 లక్షలు
డివిజన్లు	50
రోజూ తిరుపతికి వచ్చి వెళ్లే వారి సంఖ్య	1.5 లక్షల మంది

తిరుపతిలో పూర్తయిన రోడ్లు

సంవత్సరం	సీసీ రోడ్లు(కి.మీ)	వ్యయం రూ.కోట్లలో
2021–22	25.86	రూ.23.13
2022–23	53.77	రూ.48.10
2023–24	45.56	రూ.40.76
మొత్తం	125.19	రూ.111.99

సంవత్సరం	బీటీ రోడ్లు(కి.మీ)	వ్యయం రూ.కోట్లలో
2022–23	4.32	రూ. 2.50
2023–24	27.70	రూ. 16.06
మొత్తం	32.02	రూ.18.56

కొత్తగా చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ

సంవత్సరం	యూడీసీ కొత్త లైన్	ఖర్చు రూ.కోట్లలో
2021–22	25.86 కి.మీ.	రూ. 23.13
2022–23	53.77 కి.మీ	రూ. 48.10
2023–24	45.56 కి.మీ	రూ. 40.76
మొత్తం	125.19 కి.మీ	రూ.111.99

తిరుపతి దశను మార్చే రహదారులు

మాస్టర్ ప్లాన్ రహదారులు	17
అందుబాటులోకి వచ్చినవి	8
ఖర్చు చేస్తున్న మొత్తం	రూ.52.91 కోట్లు
రహదారుల విస్తీర్ణం (మీటర్లలో)	18,344 (18.34కి.మీ)
టీటీడీ అభివృద్ధి చేస్తున్న రోడ్లు	3
వ్యయం	రూ.18 కోట్లు
వంద అడుగుల రోడ్డు	1
80 అడుగుల రోడ్లు	8
60 అడుగుల రోడ్లు	5
40 అడుగుల రోడ్లు	3

అత్యాధునిక కచ్చపి ఆడిటోరియం

ఎన్టీఆర్ హయాంలో మహతి ఆడిటోరియం నిర్మించారు. ఒక్కటే ఆడిటోరియం ఉండడంతో అందరికీ అవకాశం లభించేది కాదు. దీంతో తిరుపతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరా మైదానంలో రూ.40 కోట్లతో 'కచ్చపి' ఆడిటోరియాన్ని నిర్మించారు.

నడక దారి భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



అలిపిరి నుంచి తిరుమలకు నడిచివెళ్లే మెట్ల మార్గాన్ని ఆధునికీకరించారు. చిన్నారిపై చిరుత దాడి నేపథ్యంలో అలిపిరి మార్గంలో నడిచి వెళ్లే భక్తుల తక్షణ రక్షణ కోసం టీటీడీ చేతికర్రలు అందిస్తోంది. అదేవిధంగా సెక్యూరిటీ సిబ్బందిని నియమించింది. క్రూర మృగాలను బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేసింది. వాటి జాడ తెలుసుకునేందుకు ట్రాప్ కెమెరాలు అమర్చింది. ఇప్పటికే ఐదు చిరుతలను పట్టుకుని జూలో విడిచిపెట్టింది.

యూడీసీకి చికిత్స



తిరుపతి నగరంలో 40 ఏళ్లనాటి యూడీసీతోనే రెండేళ్ల వరకు నెట్టుకొచ్చారు. తిరుపతిలో నివాసాలు పెరగడంతో నాటి యూడీసీ సామర్థ్యం సరిపోలేదు. దీంతో ఎక్కడికక్కడ మ్యాన్ హోల్స్ ఓవర్ ఫ్లో అయ్యి ఇబ్బందికరంగా మారింది. 2020లో కొత్త యూడీసీ వ్యవస్థ అవసరాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గ్రీన్ సిగ్నల్ రావడంతో 2021 నుంచి దశలవారీగా యూడీసీ పనులు ప్రారంభమయ్యాయి. శిథిలావస్థకు చేరిన యూడీసీకి చికిత్స చేస్తున్నారు.

తిరుపతిలో డబుల్ డెక్కర్ బస్సు



పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం విద్యుత్ బస్సులను తీసుకొచ్చింది. అలిపిరి డిపో కేంద్రంగా విద్యుత్ బస్సులు నడుపుతున్నారు. ప్రస్తుతం తిరుమలకు 50, విమానాశ్రయానికి 14 ఇలా మొత్తం 100 విద్యుత్ బస్సులు నడుస్తున్నాయి. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి నగరపాలక సంస్థ నిధులతో ఇండియన్ మేడ్ ఫుల్ డబుల్ డెక్కర్ బస్సును కొనుగోలు చేశారు. 60 సీట్ల కెపాసిటీ ఉన్న ఈ బస్సు గురువారం నుంచి తిరుపతి టౌన్ సర్వీసు పేరుతో నడుపుతున్నారు.

కనీవినీ ఎరుగని రీతిలో తిరుపతి అభివృద్ధి



టీడీపీ పాలనలో నిరాదరణకు గురైన తిరుపతి నగరాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తున్నాం. శ్రీనివాస సేతు వంతెన, మాస్టర్ ప్లాన్ రహదారులు, అంతర్గత రోడ్లు వేశాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం. పార్కులను అభివృద్ధి చేశాం. 22ఏలో ఉన్న స్థలాలపై స్థానికులకు పూర్తి హక్కు కల్పించాం. శ్రీవారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. – భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే

తిరుపతిని నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం



ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని గత పాలకులు పూర్తిగా విస్మరించారు. తిరుపతిని అభివృద్ధి చేయాలనే ఆలోచన మరిచారు. సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి సహకారం, టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో తిరుపతిని దేశంలోనే నంబర్–1 నగరంగా తీర్చిదిద్దుతున్నాం. ప్రజల సహకారంతో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేస్తున్నాం. ఇప్పటికే 18 రోడ్లు పూర్తి కావచ్చాయి. మరో 14 రోడ్లను కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. – భూమన అభినయ్‌రెడ్డి, డిప్యూటీ మేయర్

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

విశ్వం సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్
విశ్వం నగర్, జీవకోన, తిరుపతి
తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 96666 97219

కొడుకు కంటే పవన్‌కే ఎక్కువ బాధ

- బాలకృష్ణకు ఇదే మంచి చాన్స్
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తి: చంద్రబాబు అరెస్ట్ విషయమై ఆయన సొంత కొడుకుకంటే ప్యాకేజీ స్టార్‌కే ఎక్కువ బాధగా ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్యాకేజీ స్టార్ రాజమండ్రి జైలులో ప్యాకేజీ కుదుర్చుకుని బీజేపీ వారితో మాట్లాడకుండానే తెలుగుదేశంతో కలిసి పొత్తులో ఉన్నామని ప్రకటించేశారని మండిపడ్డారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ బాలకృష్ణకు ఇదే మంచి చాన్స్ అని, నాడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచే సమయంలో బాధపెట్టారన్నారు. నేడు జూనియర్ ఎన్టీఆర్‌కు పార్టీని స్వాధీనం చేసి ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలిగించాలన్నారు. బాలకృష్ణ తాను ఉన్నామని కేడర్‌కు భరోసా ఇస్తే ఒక పచ్చపత్రికలో కూడా ఈరోజు ఏ పేపర్‌లో రాకపోవడం చూస్తే చంద్రబాబు స్టేటజీ స్పష్టమవుతోందన్నారు. అవసరమైతే ఆయన్ను కూడా పక్కన పెడతారని అర్థమవుతోందన్నారు.

23 నుంచి ఉచిత శిక్షణ

తిరుపతి కల్చరల్: సెట్విన్, ప్రముఖ మల్టీమీడియా సంస్థ హనుమాన్ గ్రాఫిక్స్ సహకారంతో జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈనెల 23, 24 తేదీల్లో యువతీయువకులకు ఉచిత యోగా యానిమేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెట్విన్ సీఈఓ డాక్టర్ వీ.మురళీకృష్ణ తెలిపారు. 9వ తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు చదువుతున్న 15 ఏళ్ల వయస్సుపై బడిన యువతీ యువకులు శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ మంజూరు చేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు తమ పేర్లను వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9440573537, 8317301891లో సంప్రదించాలని సూచించారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: జిల్లాకు ఈనెల 18న ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి విచ్చేయనుండడంతో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీల్లో జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నారని, ఈ నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలు పగడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 18న తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. అదే సందర్భంలో తిరుపతి, తిరుమలలో పలు ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు వెల్లడించారు. ఇందులో శ్రీనివాస సేతును ప్రారంభించి, టీటీడీ ఉద్యోగులకు ఇంటి పట్టాలు మంజూరు కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లిని దర్శించుకుని తిరుమల చేరుకొని గెస్ట్ హౌస్‌లను ప్రారంభిస్తారన్నారు. ఆ తర్వాత రాత్రి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ఈ నెల 19వ తేదీన మరోసారి తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగుప్రయాణం కానున్నట్టు వెల్లడించారు. సీఎం పర్యటన నేపథ్యంలో రహదారుల్లో బారికేడ్ల ఏర్పాటు, భద్రతా చర్యలు ప్రారంభించాలన్నారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి శ్రీనివాస సేతు ప్రారంభించనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, టీటీడీ జేఈఓ సదాభార్గవి, నగరపాలక కమిషనర్ హరిత, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఆర్వో పెంచల కిషోర్, ఆర్డీఓలు కిరణ్‌కుమార్, చంద్రముని, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.



శ్రీనివాస సేతును పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ, కలెక్టర్, ఎస్పీ

క్లుప్తంగా

యువతకు ఉచిత శిక్షణ

గూడూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా ఆధ్వర్యంలో గూడూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన(పీఎంకేవీవై)4.0 ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్యామ్‌మోహన్, కళాశాల కో–ఆర్డినేటర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఇందులో అసోసియేట్ ఎలక్ట్రీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 8143576866, 8919925219, 9440168907 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రేణిగుంట: రేణిగుంట–శ్రీకాళహస్తి మార్గం గురవరాజుపల్లి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రేణిగుంట పోలీసుల కథనం మేరకు.. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆపకుండా శ్రీకాళహస్తి మార్గం వైపు వెళ్లింది. ఈ ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు యాచకుడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చూసి తరిద్దాం..

తుమ్మలగుంట బ్రహ్మోత్సవం



బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతున్న స్వాగత ఆర్చ్‌లు



ఆలయం వద్ద ముమ్మర ఏర్పాట్లు

- కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం
- దేదీప్యమానంగా విద్యుత్ వెలుగులు
- ఈనెల 17న అంకురార్పణ, 22న గరుడ సేవ
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుమల శ్రీవారికి నిర్వహించే బ్రహ్మోత్సవాల తరహాలో తుమ్మలగుంటలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే ఆలయ పరిసరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. గోడలపై దేవతామూర్తుల ప్రతిమలను ముద్రించడం, విద్యుత్ దీపాలు ఏర్పాటు పనులు ఊపందుకున్నాయి. తిరుపతి– చంద్రగిరి మార్గంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి తుమ్మలగుంట గ్రామానికి వెళ్లే దారిలో డెయిరీ ఫాం గోడలు, గ్రామంలో రోడ్లకు ఇరువైపులా చిత్రీకరించిన దేవతా మూర్తుల రూపాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి.

బ్రహ్మోత్సవాలకు 17న అంకురార్పణ

తుమ్మలగుంటలో వెలిసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి 16వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఈనెల 17వ తేదీన అంకురార్పణ చేస్తారు. 18న ధ్వజారోహణం, పెద్ద శేష వాహనంతో వాహన సేవలు ప్రారంభమవుతాయి. సెప్టెంబర్ 22న గరుడసేవ ఆ తర్వాత 26న చక్రస్నానం జరుగుతుంది. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వారు తొమ్మిది రోజుల పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో రక రకాల రూపాలతో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయానికి ఎదురుగా ఉన్న వాహన మండపంలో ఇప్పటికే స్వామివారు దేవేరులతో కలిసి ఊరేగే వాహనాలను సిద్ధం చేస్తున్నారు.



విద్యుత్ లైట్లను సరిచేస్తున్న సిబ్బంది

బారికేడ్లు, పందిళ్లు సిద్ధం

తిరుమల వెళ్లి శ్రీవారి వాహన సేవలను తిలకించడం కష్టంగా భావించే భక్తులు తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటారు. తిరుమల వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలు తిలకించి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. ఆ మేరకు తెలుగుతల్లి విగ్రహం నుంచి అవసరమైన మేరకు చలువ పందిళ్లు, బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయ శుద్ధి.. పరిసరాల పరిశుభ్రత

స్వామి వారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తుమ్మలగుంట గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు ఆలయ పరిసరాలు, వేద పాఠశాల, పుష్కరిణి, అన్న ప్రసాదాల తయారీ కేంద్రం తదితర ప్రాంతాల్లో శుభ్రతా పనులు చేపట్టారు. స్వామివారి గర్భాలయాన్ని సుగంధభరిత పరిమళాలతో ఆలయ అర్చకులు శుద్ధి చేశారు.

అన్నీ తానై.. పర్యవేక్షిస్తూ..

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తగా చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉండడంతో అన్నీ తానై ఏర్పాట్లను పర్యవేక్షణ చేస్తున్నారు. ఉత్సవ ఏర్పాట్ల విషయంలో ఎక్కడా రాజీ లేకుండా భక్తుల సౌకర్యాలు దృష్టిలో ఉంచుకుని పనులు చేపడుతున్నారు. ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆలయ అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశం నిర్వహిస్తూ ఏర్పాట్ల విషయంలో ఎక్కడా తేడాలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వైఎస్సార్ కాపు నేస్తం రేపు

- జిల్లాలో 8,512 మంది లబ్ధిదారులు

తిరుపతి అర్బన్: పేదవారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వినూత్న పథకాలు అమలు చేస్తూ మన్ననలు అందుకుంటోంది. ఇందులో భాగంగా నాల్గో విడతగా ఈనెల 16వ తేదీన తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు నుంచి వైఎస్సార్ కాపు నేస్తం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అదే సమయంలో తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ పథకం ద్వారా కాపు, తెలగ, ఒంటరి, బలిజ సామాజిక వర్గాలకు చెందిన 45–60 ఏళ్ల వయస్సు కల్గిన 8,512 మందికి లబ్ధి చేకూరనుంది. ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున వారి ఖాతాల్లోకి రూ.12,76,80,000 జమ కానుంది. ఐదేళ్లలో ఒక్కో మహిళకు రూ.75 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 16వ తేదీ ఇవ్వనున్న నాల్గో విడత పూర్తి అయితే ఇప్పటి వరకు 30,176 మందికి రూ.45.26 కోట్లు చెల్లించినట్లు అవుతుంది.

వైఎస్సార్ కాపునేస్తం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మంజూరైన మొత్తం రూ.కోట్లలో
2020–21	6,501	రూ.9.76
2021–22	7,151	రూ.10.72
2022–23	8,012	రూ.12.02
2023–24	8,512	రూ.12.76

పారదర్శక ఓటర్ల జాబితానే లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన ఓటర్ల జాబితాను తయారు చేస్తున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆయన గురువారం రాజకీయ పార్టీల నేతలు, ఈఆర్‌ఓలతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా 2024 మేరకు ఇంటింటి పరిశీలన పూర్తి చేశామని వెల్లడించారు. 17,32,448 ఓటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్టు తెలిపారు. ఈ నెల 18 వరకు ఆన్‌లైన్ అప్‌డేట్ కోసం అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ఈనెల 20న జరిగే సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి ప్రతిపాదనలు ఎన్నికల కమిషన్‌కు పంపనున్నామన్నారు. నగరపాలక కమిషనర్ హరిత, డీఆర్వో పెంచల కిషోర్, ఈఆర్వోలు కనకనరసారెడ్డి, కోదండరామిరెడ్డి, చంద్రముని, కిరణ్ కుమార్, ఎన్నికల తహసీల్దార్ సురేష్‌బాబు, ఏఈఆర్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతులు లేని ఉత్పత్తులు సీజ్

చిల్లకూరు: చిల్లకూరులోని ఆక్వా నీడ్స్ దుకాణంలో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న వస్తువులను గురువారం మత్స్యశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేశారు. అనంతరం దుకాణదారునికి రూ.75 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా చిల్లకూరు మత్స్యశాఖాభివృద్ధి అధికారి రఘుబాబు మాట్లాడుతూ ఆక్వా రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం ఆక్వా కోస్టల్ అథారిటీని ఏర్పాటు చేసిందని, ఆక్వా ఫీడ్, ఉత్పత్తులను విక్రయించే వారు కచ్చితంగా అనుమతులు పొంది, సంబంధిత వాటిని మాత్రమే విక్రయించాలని చెప్పారు.

లారీ కింద హాహాకారాలు

- ముందు టైరుకింద ఇరుక్కున్న కాలు
- అరగంట పాటు నరకం



లారీ ముందు టైరు కింద ఇరుక్కుపోయిన రమేష్

దొరవారిసత్రం: ఓ వ్యక్తి రోడ్డు దాటే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. లారీ టైరు కింద ఎడమ కాలు ఇరుక్కుపోయింది. సుమారు అరగంటపాటు శ్రమించి రక్షించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలు.. మండలంలోని ముచ్చలగుంట ఎస్టీ కాలనీకి చెందిన రమేష్(50), భార్య శారదతో కలిసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన కుమార్తెను చూసుకుని తిరిగి ఇంటికే వచ్చే క్రమంలో దొరవారిసత్రంలో ఆటో దిగారు. రమేష్ రోడ్డు దాటుతున్న సమయంలో చెన్నై నుంచి విజయవాడకు వెళ్లే లారీ ఢీకుంది. ఈ ప్రమాదంలో రమేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఓ కాలు లారీ ముందు చక్రాల కింద ఇరుక్కుపోయింది. 20 మీటర్ల మేర రోడ్డుపై ఈడ్చుకుంటూ రావడంతో కాలు పూర్తిగా నుజునుజ్జు అయ్యింది. డ్రైవర్ పరారు కావడంతో వాహనం కిందే అరగంట పాటు నరకయాతన అనుభవించాల్సిన దుస్థితి నెలకొంది. స్థానికులు స్పందించి లారీని వెనక్కు మళ్లించారు. ఆపై చికిత్స నిమిత్తం స్వర్ణాటోల్‌వే అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నెల్లూరు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు 410 ఆర్టీసీ సర్వీసులు

- తమిళనాడుకు 150, బెంగళూరుకు 50 బస్సులు
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు వెల్లడి

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాలకు 410 ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. గురువారం ఆయన తిరుపతి డీపీడీఓ కార్యాలయంలో డీపీటీఓ చెంగల్‌రెడ్డితో కలసి అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఉత్సవాలకు ఆర్టీసీ బాధ్యతగా శ్రీవారి భక్తులకు సేవలందిస్తున్నారు. ఈ నెల 18 నుంచి 26 వరకు నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలకు ఆర్టీసీ ఉద్యోగులు నిబద్ధతతో సేవలు అందివ్వాలన్నారు. బ్రహ్మోత్సవాలలో రోజుకు 410 బస్సులు 5,456 ట్రిప్పులు నడుస్తాయన్నారు. 2.20లక్షల మందికి రాకపోకలు కల్పిస్తామని చెప్పారు. మిగిలిన రోజుల్లో రోజుకు 3,930 ట్రిప్పుల్లో 1.60లక్షల మంది వెళ్లవచ్చన్నారు. ఉత్సవాల్లోనే కాకుండా సాధారణ రోజుల్లో తిరుమలకు లక్ష మంది ప్రయాణికులకు వెళ్లగలిగేలా సర్వీసులు నడుపుతున్నట్టు చెప్పారు. ఉత్సవాల్లో అవసరమైతే ట్రిప్పులు పెంచుతామన్నారు.మరోవైపు ప్రత్యేక బస్సులను నడపడానికి 40 మంది అధికారులు, 20 మంది సూపర్ వైజర్లు, 201 మంది డ్రైవర్లు,110 మంది కండక్టర్లు,115 మంది సెక్యూరిటీ సిబ్బంది, 25 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. అంతేకాకుండా తమిళనాడులోని వివిధ ప్రాంతాలకు 150 సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. అలాగే, తమిళనాడు ప్రభుత్వం కూడా ఉత్సవాలకు అదనంగా 150 సర్వీసులు ఏర్పాటు చేశారని వెల్లడించారు. ఇక, జిల్లా నుంచి బెంగళూరుకు 50 సర్వీసులు ఏర్పాటు చేశామని చెప్పారు. ముఖ్యమైన అన్ని ప్రాంతాలకు తమ సర్వీసులు ఏర్పాటు చేశామని కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.